అయోధ్యలో బాల రాముడి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం సోమవారం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ వేడుకలో అగ్ర నటుడు చిరంజీవి దంపతులు, రాంచరణ్, పవన్‌కల్యాణ్ పాల్గొన్నారు. ఇంకా ఈ ఉత్సవంలో అమితాబ్ బచ్చన్, రజనీకాంత్, అభిషేక్ బచ్చన్, రణబీర్ కపూర్, అలియా భట్, శిల్పాశెట్టి, కంగనా రనౌత్, విక్కీ కౌశల్, కత్రినా కైఫ్ తదితరులు సందడి చేశారు. అయోధ్య వేడుకల్లో తారలు పాల్గొన్న ఫొటోలు సోషల్ మీడియాలో అభిమానులను ఆకట్టుకున్నాయి.

ఇంటర్వెల్ ట్విస్ట్ హైలైట్



ఎన్టీఆర్ కథానాయకుడిగా కొరటాల శివ దర్శకత్వంలో తెరకెక్కిస్తున్న 'దేవర' చిత్రంపై అభిమానులు భారీ అంచనాలు పెట్టుకున్నారు. ఇటీవల విడుదల చేసిన గ్లింప్స్‌కు మంచి స్పందన లభించింది. ఎర్ర సముద్రం నేపథ్యంలో యాక్షన్ ఘట్టాలు, ఎన్టీఆర్ చెప్పిన సంభాషణలు హైలైట్‌గా నిలిచాయి. ప్రస్తుతం ఈ చిత్రం హైదరాబాద్‌లో చిత్రీకరణ జరపుకుంటున్నది. తాజా సమాచారం ప్రకారం ఈ సినిమాలో ఇంటర్వెల్ ఎపిసోడ్ హైలైట్‌గా ఉంటుందట. ఇందులో ఎన్టీఆర్ పాత్ర తాలూకు ఒక రహస్యం రివీల్ అవుతుందని, సినిమా మొత్తానికే ఆ ట్విస్ట్ హైలైట్‌గా ఉంటుందని చెబుతున్నారు. ఈ సీక్వెన్స్‌లో ఎన్టీఆర్ రగ్గడ్ లుక్‌లో డిఫరెంట్ గెటప్‌లో కనిపిస్తారని అంటున్నారు. విస్మరణకు గురైన ఓ తీర ప్రాంతపు నేపథ్య కథాంశంతో హై ఓల్టేజ్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. ఎన్టీఆర్ ఆర్ట్స్, యువ సుధ ఆర్ట్స్ పతాకాలపై సుధాకర్ మిక్కిలినేని, కొరటాల హరికృష్ణ నిర్మిస్తున్న ఈ చిత్ర తొలిభాగం ఏప్రిల్ 5న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకురానుంది.



తాప్సీ

అలాంటి సినిమాలు చేయను!

'డంకీ' చిత్రంతో ఇటీవల చక్కటి విజయాన్ని సొంతం చేసుకొంది పంజాబీ సుందరి తాప్సీ. ప్రస్తుతం సక్సెస్ జోష్‌లో ఉన్న ఈ భామ తన తదుపరి సినిమాల కోసం సిద్ధమవుతున్నది. ఈ నేపథ్యంలో ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో 'యానిమల్' సినిమా గురించి ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేసింది. అలాంటి కథలో తాను నటించలేనని పేర్కొంది. ఆమె మాట్లాడుతూ 'ఇతర నటీనటుల వ్యక్తిగత జీవితాల గురించి నేను మాట్లాడను. మనది ప్రజాస్వామ్య దేశం. ఎవరికి నచ్చింది వారు ఎంచుకునే స్వేచ్ఛ ఉంది. నటీనటులందరికి ప్రతిభా పాటవాలతో పాటు కొన్ని బాధ్యతలు ఉంటాయి. వాటిని గౌరవిస్తూ నేను ముందుకు సాగుతాను. వ్యక్తిగతంగా మాత్రం నేను ఆ తరహా కథల్లో నటించలేను' అని చెప్పుకొచ్చింది. రణబీర్‌కపూర్, రష్మిక మందన్న ప్రధాన పాత్రల్లో సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో రూపొందిన 'యానిమల్' చిత్రం ప్రపంచవ్యాప్తంగా భారీ వసూళ్లను సాధించింది. తండ్రీకొడుకుల అనుబంధం ప్రధానంగా న్యూఏజ్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ప్రేక్షకులను ఆకట్టుకుంది. అయితే కొందరు మాత్రం ఈ సినిమాపై విమర్శలు చేశారు. హింస పాలు ఎక్కువగా ఉందని, మహిళల గౌరవాన్ని తగ్గించేలా సన్నివేశాలు ఉన్నాయని విమర్శలొచ్చాయి. ఈ నేపథ్యంలో తాప్సీ చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.

'జై హనుమాన్'కు శ్రీకారం

తేజ సజ్జా కథానాయకుడిగా ప్రశాంత్‌వర్మ దర్శకత్వంలో తెరకెక్కిన 'హను-మాన్' చిత్రం ఇటీవలే విడుదలై చక్కటి ప్రేక్షకాదరణ సొంతం చేసుకుంది. రెండో వారాంతంలో ఈ సినిమా 200కోట్ల వసూళ్ల మైలురాయిని చేరుకుందని చిత్ర బృందం ప్రకటించింది. తొలి భాగం ముగింపులోనే ఈ సినిమా సీక్వెల్ 'జై హనుమాన్' గురించి హింట్ ఇచ్చారు దర్శకుడు ప్రశాంత్ వర్మ. తాజాగా 'జై హనుమాన్'కు స్క్రిప్ట్ సిద్ధమైందని ఆయన తెలిపారు. అయోధ్యలో బాల రాముడి విగ్రహ ప్రతిష్ఠాపన సందర్భంగా డైరెక్టర్ ప్రశాంత్ వర్మ హైదరాబాద్‌లోని ఓ హనుమాన్ ఆలయంలో నిర్వహించిన యాగంలో పాల్గొని సీక్వెల్ స్క్రిప్ట్‌ను హనుమంతుడి విగ్రహం ముందు ఉంచారు. ప్రీ ప్రొడక్షన్ ప్రారంభించడానికి ఇంతకంటే మంచి సందర్భం తనకు లభించదని అన్నారు. సినిమాకు సంబంధించి మరిన్ని వివరాలు త్వరలో వెల్లడిస్తామని ప్రశాంత్ వర్మ తెలిపారు. కాగా 'హను-మాన్' సక్సెస్ నేపథ్యంలో ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో 'జై హనుమాన్' చిత్రంలో ఆంజనేయుడి పాత్రలో ఓ స్టార్ హీరో నటిస్తాడని, ఈ సినిమాను 2025లో విడుదల చేస్తామని ప్రశాంత్‌వర్మ పేర్కొన్నారు

నరేంద్ర మోదీ బయోపిక్ 'విశ్వనేత'

భారత ప్రధాని నరేంద్రమోదీ జీవితం ఆధారంగా 'విశ్వనేత' పేరుతో బయోపిక్ రానుంది. అన్ని భారతీయ భాషల్లో తెరకెక్కించబోతున్న ఈ చిత్రానికి సి.హెచ్.క్రాంతి కుమార్ దర్శకత్వం వహించనున్నారు. వందే మీడియా ప్రైవేట్ లిమిటెడ్ పతాకంపై కాశిరెడ్డి శరత్ రెడ్డి నిర్మించనున్న ఈ చిత్రంలో అభయ్ డియోల్, నీనా గుప్తా, అనుపమ్‌ఖేర్, పల్లవి జోషి ముఖ్య పాత్రలను పోషించనున్నారు. ప్రముఖ స్వరకర్త కీరవాణి తనయుడు కాలభైరవ సంగీతాన్నందిస్తున్నారు. ఆర్టికల్ 370 రద్దు, డీమానిటైజేషన్, అయోధ్య రామ మందిర నిర్మాణం వంటి అనేక అంశాలతో ఈ చిత్రాన్ని తెరకెక్కించబోతున్నామని, ప్రధాని నరేంద్రమోదీ అసాధారణ జీవిత ప్రయాణానికి దృశ్యరూపంలా ఉంటుందని చిత్ర బృందం పేర్కొంది.

మాట విలువ తెలిపే 'బూట్‌కట్ బాలరాజు'

గ్లోబల్ ఫిలిమ్స్, కథ వేరుంటాది బ్యానర్స్‌పై ఎండీ పాషా నిర్మిస్తున్న చిత్రం 'బూట్‌కట్ బాలరాజు'. బిగ్‌బాస్ ఫేమ్ సోహెల్ టైటిల్ రోల్ పోషిస్తున్నారు. మేఘ లేఖ, సునీల్, సిరి హన్మంత్, ఇంద్రజ ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రం పాటలు, టీజర్ ఇప్పటికే విడుదలయ్యాయి. ఫిబ్రవరి 2న రిలీజ్‌కు సిద్ధంగా ఉన్న ఈ సినిమా ట్రైలర్‌ను మేకర్స్ సోమవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా హీరో సోహెల్ మాట్లాడుతూ.. 'నేను షార్ట్ ఫిల్మ్ నుంచి ఒక్కో మెట్టు ఎక్కుతూ ఈ స్థాయికి వచ్చాను. అందరూ ఆదరిస్తారని ఆశిస్తున్నా' అన్నారు. 'కంటెంట్ ఉన్న ప్రతి సినిమా హిట్ అవుతుంది. 'బూట్‌కట్ బాలరాజు' మంచి వినోదాత్మక చిత్రం. మాటకు ఉన్న విలువ, గౌరవం గురించి ఈ చిత్రంలో చెబుతున్నాం' అని నిర్మాత వేణుగోపాల్ తెలిపారు. ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో బిగ్‌బాస్ ఏడు సీజన్ల కంటెస్టెంట్లతోపాటు చిత్ర యూనిట్ సభ్యులంతా పాల్గొన్నారు. ఈ సినిమాకు సంగీతం: భీమ్స్ సిసిరోలియో, నిర్మాత: బెక్కం వేణుగోపాల్, దర్శకత్వం: శ్రీనివాస్ కోనేటి.

మస్తు షేడ్స్ ఉన్నాయ్ రా..

హాస్య నటుడు అభినవ్ గోమఠం హీరోగా 'మస్తు షేడ్స్ ఉన్నాయ్ రా' పేరుతో ఓ చిత్రం తెరకెక్కుతున్నది. వైశాలి రాజ్ కథానాయిక. తిరుపతి రావు ఇండ్ల దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్ర టైటిల్ లోగోను ఇటీవల ఓ కాలేజీలో జరిగిన కార్యక్రమంలో యువ దర్శకుడు, నటుడు తరుణ్ భాస్కర్ విడుదల చేశారు. దర్శకుడు చిత్ర విశేషాలు తెలియజేస్తూ 'నటుడిగా అభినవ్ గోమఠంలోని కొత్త కోణాన్ని ఆవిష్కరించే చిత్రమిది. లవ్, కామెడీ అంశాలతో ఆకట్టుకుంటుంది. కొత్తదనంతో కూడుకున్న కథతో అందరిని మెప్పిస్తుంది. ఫిబ్రవరి ద్వితీయార్థంలో విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నాం' అన్నారు. తరుణ్‌భాస్కర్, అలీ రేజా, మెయిన్, చక్రపాణి ఆనంద్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: సిద్ధార్థ్ స్వయంభూ, సంగీతం: సంజీవ్ టి, సంభాషణలు: రాధామోహన్, నిర్మాతలు: భవాని కాసుల, ఆరెమ్ రెడ్డి, ప్రశాంత్ వి, దర్శకత్వం: తిరుపతి రావు ఇండ్ల.

అభినవ్ గోమఠం

స్వేచ్ఛ, ఆత్మగౌరవం గురించిన కథ

అరుణ్ మాథేశ్వరన్

తమిళనాట ప్రేక్షకాదరణ పొందిన ధనుష్ చిత్రం 'కెప్టెన్ మిల్లర్'. ఈ నెల 26న తెలుగులో విడుదల కానుంది. సత్యజ్యోతి ఫిలిమ్స్ పతాకంపై నిర్మించిన ఈ చిత్రాన్ని ఏషియన్ సినిమాస్, సురేశ్ ప్రొడక్షన్స్ తెలుగులో విడుదల చేస్తున్నాయి. ఈ సందర్భంగా దర్శకుడు అరుణ్ మాథేశ్వరన్ చిత్ర విశేషాలను పాత్రికేయులతో పంచుకున్నారు. ''కెప్టెన్ మిల్లర్' గురించి పదేళ్ల క్రితం ఆలోచన వచ్చింది. బ్రిటిష్ ఆర్మీలో భారతీయ సైనికుడిపై సినిమా చేయాలన్న ఆలోచనతో స్క్రిప్ట్ పని మొదలు పెట్టాను. స్క్రిప్ట్ పూర్తి చేసిన తర్వాత కెప్టెన్ మిల్లర్ పాత్రకు ధనుష్ సరిగ్గా సరిపోతారని భావించాను. ధనుష్ ఎలాంటి పాత్రైనా చేయగలడు. అతనితో పనిచేసిన అనుభవం అద్భుతం. ఆయన నుంచి చాలా నేర్చుకున్నాను. నేర్చుకోవాల్సినవి ఇంకా ఉన్నాయి. 'కెప్టెన్ మిల్లర్' చాలా ఎమోషనల్ కథ. ఈ సినిమాలో యాక్షన్ 40 శాతమే ఉంది. మిగతా అంతా పాత్ర ప్రయాణం గురించిన ప్యూర్ డ్రామా. ఈ చిత్రంలో సమిష్టి తారాగణం ఉంది. ధనుష్, శివన్న (శివరాజ్‌కుమార్) మధ్య సన్నివేశాలు ప్రేక్షకులను కట్టిపడేస్తాయి. మహిళా పాత్రలు ప్రేక్షకులను ఆశ్చర్యచకితులను చేయాలనుకునే నేను వెల్మతి పాత్ర కోసం ప్రియాంక అరుల్ మోహన్ కరెక్ట్ అనుకున్నాం. 'కెప్టెన్ మిల్లర్' స్వేచ్ఛ, ఆత్మగౌరవం గురించిన కథ. సినిమా ఇతివృత్తం చాలా యూనివర్సల్‌గా ఉంటుంది. ప్రతి ఒక్కరికీ నచ్చుతుంది. ముఖ్యంగా తెలుగు ప్రేక్షకులకు'. అని చెప్పారు.

తండ్రీకొడుకుల కథ



సముద్రఖని ప్రధాన పాత్రలో ధనరాజ్ నటిస్తూ దర్శకత్వం వహిస్తున్న తాజా చిత్రానికి 'రామం రాఘవం' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. స్లేట్ పెన్సిల్ స్టోరీస్ పతాకంపై పృథ్వీ పొలవరపు నిర్మిస్తున్నారు. సోమవారం ఫస్ట్‌లుక్‌ను విడుదల చేశారు. ఈ సినిమాలో సముద్రఖని, ధనరాజ్ తండ్రీకొడుకులుగా నటిస్తున్నారు. ఈ సందర్భంగా ధనరాజ్ చిత్ర విశేషాలు తెలియజేస్తూ 'ఇప్పటివరకు రానటువంటి తండ్రీకొడుకుల కథ ఇది. హృదయాన్ని కదిలించే భావోద్వేగాలతో ఆకట్టుకుంటుంది. తెలుగు, తమిళం భాషల్లో ఒకేసారి విడుదల చేస్తాం' అన్నారు. మోక్ష, హరీష్ ఉత్తమన్, సత్య పృథ్వీ, శ్రీనివాస రెడ్డి, చిత్రం శ్రీను, ప్రమోదిని తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: దుర్గా ప్రసాద్, సంగీతం: అరుణ్ చిలువేరు, కథ: శివప్రసాద్ యానా, దర్శకత్వం: ధనరాజ్.

అదృష్టం కలిసొచ్చేనా?!

దక్షిణాది సినిమాల్లో అదృష్టాన్ని పరీక్షించుకుంటున్న మరో ముంబయి ముద్దుగుమ్మ కావ్యా థాపర్. మోడలింగ్ రంగం నుంచి సినీ ఇండస్ట్రీలో అడుగుపెట్టిన ఈ భామ రాహుల్ విజయ్ కథానాయకుడిగా నటించిన 'ఈ మాయ పేరేమిటో' అనే చిన్న సినిమాతో తెలుగులో హీరోయిన్‌గా పరిచయమైంది. తర్వాత 'ఏక్ మినీ కథ'లో సంతోష్ శోభన్ సరసన నటించినప్పటికీ అమ్మడికి కొద్దిపాటి గుర్తింపే వచ్చిందని టాక్. ఎందుకంటే ఆ సినిమా థియేటర్ రిలీజ్ కాకుండా నేరుగా ఓటీటీ వేదికగా స్ట్రీమింగ్ అయింది. ఆ మధ్య తమిళనాట రెండు మూడు చిత్రాల్లో నటించినప్పటికీ అక్కడా చెప్పుకోదగ్గ విజయం దక్కలేదనేది సినీ విశ్లేషకుల మాట. అయితే కావ్య ట్రాక్ రికార్డు గురించి లెక్కచేయకుండా ఆమెకు రెండు పేరున్న సినిమాల్లో అవకాశం ఇచ్చారు మేకర్స్. అవే 'ఈగల్', 'ఊరి పేరు భైరవకోన'. చిత్రమేమిటంటే ఈ రెండు సినిమాలూ ఒకేరోజు విడుదల కానున్నాయి. సంక్రాంతి బరిలో నుంచి తప్పుకున్న 'ఈగల్' టీమ్ రిలీజ్ డేట్‌ను ఫిబ్రవరి 9కి వాయిదా వేసుకుంది. అంతకన్నా ముందు నుంచే సేమ్ డేట్‌కు 'ఊరి పేరు భైరవకోన' షెడ్యూల్ ప్రకటించింది. ఒకే హీరోయిన్ నటించిన క్రేజీ సినిమాలు ఒకే రోజు విడుదలవుతుండటం యాదృచ్ఛికమే. గత ఏడాది సంక్రాంతికి ఒకేరోజు వ్యవధిలో శ్రుతిహాసన్ నటించిన 'వాల్తేరు వీరయ్య', 'వీరసింహారెడ్డి' విడుదలలై హిట్ కొట్టాయి. ఇప్పుడు ఇదే కోవలో కావ్య నటించిన సినిమాలు వస్తున్నాయి. ఇవి విజయాన్నందుకొని ఆమె కెరీర్‌ను గాడిలో పెడతాయో లేదో చూడాలి.



సోషియో ఫాంటసీ 'అరి'

వినోద్‌వర్మ, సూర్య పురిమెట్ల, అనసూయ భరద్వాజ్, సాయికుమార్, శ్రీకాంత్ అయ్యంగార్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'అరి'. 'మై నేమ్ ఈజ్ నో బడీ' ఉపశీర్షిక. జయశంకర్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని ఆర్వీ సినిమాస్ సంస్థ నిర్మిస్తున్నది. సోమవారం సినిమాలో కీలక పాత్ర పోషించిన సూర్య పురిమెట్ల క్యారెక్టర్ ఫస్ట్‌లుక్‌ను విడుదల చేశారు. 'సోషియో ఫాంటసీ జోనర్‌లో వినూత్నమైన కథ ఇది. కథ, కథనాలు ఉత్కంఠను పంచుతాయి. ఈ సినిమా హిందీ రీమేక్‌పై బాలీవుడ్ హీరో అభిషేక్ బచ్చన్ ఆసక్తి చూపిస్తున్నాడు. త్వరలో విడుదల తేదీని ప్రకటిస్తాం' అని చిత్ర బృందం పేర్కొంది. ఈ చిత్రానికి కెమెరా: కృష్ణప్రసాద్, శివశంకర వరప్రసాద్, ప్రొడక్షన్ డిజైనర్: రాజీవ్ నాయర్, నిర్మాతలు: శ్రీనివాస్ రామిరెడ్డి, తిమప్ప నాయుడు పురిమెట్ల, శేషు మారంరెడ్డి, సమర్పణ: ఆర్‌వీ రెడ్డి, రచన-దర్శకత్వం: జయశంకర్.

ప్రేమ జ్ఞాపకాల్లో..

చరిష్మా శ్రీకర్, చందు

చందు కోడూరి, చరిష్మా శ్రీకర్ జంటగా డ్రీమ్ జోన్ పిక్చర్స్ బ్యానర్‌పై తెరకెక్కుతున్న చిత్రం 'ప్రేమలో'. హీరో చందు కోడూరి స్వీయ దర్శకత్వం వహించిన ఈ సినిమాను రాజేశ్ కోడూరి నిర్మించారు. జనవరి 26న విడుదల కానున్న ఈ చిత్ర ట్రైలర్‌ను నటుడు శివాజీ రాజా సోమవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా హీరో, దర్శకుడు చందు మాట్లాడుతూ.. 'నాకు సినిమాలు అంటే చాలా ఇష్టం. చాలా కాలం నుంచి ఇండస్ట్రీలో ఉంటున్నా పెద్దగా పేరు తెచ్చుకోలేకపోయాను. అయినా ఇప్పుడు దర్శకుడిగా, కథానాయకుడిగా ఈ సినిమాతో వస్తున్నా. భావోద్వేగభరితమైన ప్రేమకథ ఇది. ప్రతి ఒక్కరికి ప్రేమ జ్ఞాపకాలను గుర్తుకు తెస్తుంది' అన్నారు. ఈ చిత్రానికి కెమెరా: రామ్.పి నందిగం, సంగీతం: సందీప్ కనుగుల, మాటలు: ఐ రవి, నిర్మాత: రాజేశ్ కోడూరి, కథ-స్క్రీన్‌ప్లే-దర్శకత్వం: చందు కోడూరి.

సామాజిక సందేశంతో 'కంచర్ల'

కంచర్ల ఉపేంద్ర హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'కంచర్ల'. రెడ్డెం యాదవ్ కుమార్ దర్శకుడు. మీనాక్షి జైస్వాల్, ప్రణీత కథానాయికలు. ఎస్ఎస్ఎల్ఎస్ పతాకంపై కంచర్ల అచ్యుత రావు నిర్మిస్తున్నారు. త్వరలో విడుదలకు సిద్ధమవుతున్నది. ఈ సందర్భంగా నిర్మాత మాట్లాడుతూ 'సమసమాజం రావాలనే కాన్సెప్ట్‌తో అభ్యుదయ భావాలతో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నాం. యువత రాజకీయాల్లోకి రావాలనే సందేశం ఉంటుంది. ప్రస్తుతం పాటలను చిత్రీకరిస్తున్నాం' అన్నారు. యువతలో సామాజిక స్పృహను పెంపొందించే చిత్రమిదని దర్శకుడు తెలిపారు. సుమన్, అజయ్‌ఘోష్, కాశీ విశ్వనాథ్, సుధ, రాజా రవీంద్ర తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: గుణశేఖర్, సంగీతం: కుంచె రఘు, దర్శకత్వం: రెడ్డెం యాదవ్ కుమార్.